



చలో ఢిల్లీకి తరలి వెళ్తున్న కార్మికులు, కర్షకులు, నాయకులు

ఢిల్లీకి కదిలిన కార్మిక, కర్షకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల న జంతర్ మంతర్ వద్ద జరుగు కిసాన్ కర్మ చారి సంఘర్ష యాత్రకు సోమవారం ఉదయం 11:30 గంటలకు స్థానిక కార్మిక కర్షక భవన్ నుండి రైతు సంఘం కార్మిక సంఘం వ్యవసాయ కూలీల సంఘాల నుండి ఆయా సంఘాల కార్యకర్తల ప్రదర్శన ఆనంద్ టాకీస్, బంగారు పేట, రైల్వే స్టేషన్ సర్కిల్ నుండి ప్రదర్శన రైల్వే స్టేషన్ చేరుకున్నది. ఓల్డ్ సిటీ నుండి సిఐటియు అనుబంధ సంఘాల ప్రదర్శన ఓల్డ్ టౌన్ గడియారం హాస్పిటల్ నుండి పాత బస్టాండ్ మీదుగా కోట్ల సర్కిల్ నుండి వందలాది మందితో ప్రదర్శన కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. రెండు చోట్ల నుండి విడివిడిగా ప్రారంభమైన ఈ ప్రదర్శనలకు సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ సిఐటియు సీనియర్ నాయకులు బి. రామాంజనేయులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ఉపాధ్యక్షులు హనుమంతు, వీరశేఖర్ సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ సాయిబాబా, ఎం. గోపాల్ నాయకత్వం వహించారు. ఓల్డ్ టౌన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శనకు సిఐటియు నాయకులు గౌస్‌దేశాయ్, మారెళ్ళ విజయ్, ఎస్ఎండి షరీఫ్, కె.రాజగోపాల్, అబ్దుల్ దేశాయ్, కుమార్ తదితరులు నాయకత్వం వహించారు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ ముందు కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల కార్యకర్తలను ఉద్దేశించి మాజీ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, పిఎస్ రాధాకష్ణ, రైతు సంఘం నాయకులు జి.రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెవి. నారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ విధానాల వల్ల దేశం సర్వనాశనం అయిపోతున్నదని అన్ని రంగాలు మోడీ విధానాలతో కుదేలైపోతున్నాయని, వీటి పరిరక్షణ కోసమే 5న లక్షలాదిమంది కిసాన్ ఖర్మ చారి సంఘర్షయాత్రలో పాల్గొంటున్నారని తెలిపారు. మన సంఘాల హక్కుల కోసమే కాకుండా భారతదేశాన్ని బిజెపి దుర్మార్గ దుష్ట పరిపాలన నుండి భరతమాతను విముక్తి చేయడానికి భవిష్యత్‌లో 140 కోట్ల మంది ప్రజల ప్రజాతంత్ర హక్కులు రాజ్యాంగ పరిరక్షణ కోసం కంకణ బద్ధులై పోరాటాలు చేయాలని తెలిపారు. మోడీ అనాలోచిత అసమంజస విధానాలతో పతనమైన భారత ప్రజాస్వామ్యాన్ని పరిక్షించుకోవాలని నాయకులు కార్యకర్తలకు ఉద్బోధించారు. 2024 ఎన్నికలలో మోడీనిగద్దె దించడమే ప్రజలందరి బాధ్యతగా దేశంలోని అన్ని పార్టీలు అన్ని ప్రజాసంఘాలు ప్రజలందరినీ ఐక్యం చేసి అందరూ పార్టీల కతీతంగా కలిసి మెలిసి ఐకమత్యంగా దేశ భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు, రైతు, వ్యవసాయ, కౌలు, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, వృత్తి సంఘాల నాయకులు బయలుదేరి వెళ్లారు. వందలాదిగా కదిలిన వారికి రైల్వే స్టేషన్లో వీడ్కోలు పలికారు.


బెట్టింగ్ జోరు

'నా కొడుకు ఇంటర్ వరకూ బుద్ధిగా ఉండేవాడు. ఆ తర్వాత ఇంట్లో మెల్లగా డబ్బు తీసుకెళ్లడం ప్రారంభించాడు. బయట కూడా దాదాపు రూ.లక్ష వరకూ అప్పు చేశాడు. మేం ఆర్థికంగా క్షీణించి వీధిన పడాల్సి వచ్చింది. చివరికి తెలిసింది క్రికెట్ బెట్టింగ్‌లో మొత్తం పోగొట్టుకున్నాడని' ఇదీ ఓ తల్లి ఆవేదన. ఆ తల్లి మాత్రమే కాదు. క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలై అప్పుల పాలవుతున్న యువకుల తల్లిదండ్రులందరి ఆవేదనా

• ఐపిఎల్‌తో మొదలైన పందేల పర్వం • ఆర్థికంగా నష్టపోతున్న యువత

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఐపిఎల్ సీజన్ వచ్చిందంటే యువతలో జోరు అంతా.. ఇంతా కాదు. ఆ జోరును బెట్టింగ్ బుకీలు క్యాష్ చేసుకుంటున్నారు. మ్యాచ్‌లో సాగే బంతి బంతికీ పందేలు కాస్తున్నారు. ప్రస్తుతం ఐపిఎల్ ప్రారంభం రోజున కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మొదలైన క్రికెట్ బెట్టింగ్ ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ఊపందుకుంది. తొలుత క్రికెట్ అంటే మానసికోల్లాసం కోసం, క్రీడా స్ఫూర్తి కోసమే ఆడేవారు. నేడు అది జూద క్రీడగానూ మారిపోయింది. గతంలో పట్టణాలకే పరిమితమైన 'బెట్టింగ్ ఫీవర్' నేడు మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాలకూ విస్తరించింది. వ్యవహారమంతా సెల్‌ఫోన్లలోనూ, ఆన్‌లైన్లలోనే సాగుతోంది. ప్రత్యేకంగా సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకుని తమ పేర్లతో లేని సిమ్ కార్డులను యువత బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నారు. రూ.100 కాస్తే రూ.150, రూ.200 ఇస్తామంటూ బుకీలు ఆశ చూపి యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. దీంతో యువత బెట్టింగ్‌లో బిజీబిజీ అయిపోయారు. మ్యాచ్ మొదలవడానికి రెండు, మూడు గంటల ముందే వాట్సప్, మెసేజ్, ఫోన్ కాల్స్, ఇంటర్నెట్‌లో యువత బెట్టింగ్‌ను హోరెత్తిస్తున్నారు. చివరికి సర్వం కోల్పోయి వీధిన పడుతున్నారు. మ్యాచ్ ముగిశాక నగదు పంపిణీలో తేడాలు వస్తుండడంతో విద్యార్థుల్లోనూ, యువతలోనూ గొడవలు తలెత్తి పోలీసు స్టేషన్లలో పంచాయితీల వరకూ వెళ్తుండడం గమనార్హం. బెట్టింగ్ ద్వారా రాష్ట్రంలో రోజుకు రూ.కోట్లు చేతులు మారుతోంది. సాయంత్రమైతే చాలు గ్రామాల్లో ఇదే చర్చ జరుగుతోంది. 'ఈ రోజు ఏ జట్ల మధ్య మ్యాచ్ ఉంది. ఎవరెవరు ఆడుతున్నారు. ఏ జట్టుపై పందెం కాయాలి. ఎంత కాస్తే మనకెంత వస్తుంది' అంటూ యువత ఫోన్లలో సంభాషణలు సాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల మొదలు వృద్ధుల వరకూ అందరూ ఈ బెట్టింగ్ వ్యవహారంలో పాలుపంచుకుంటున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారనే పందెంతో పాటు టాస్ ఎవరు గెలుస్తారన్నదీ నేడు పందెంగా మారిపోయింది. ఈ బంతికి ఎంత స్కోర్ కొడతారనే పందెమూ నేడు అధికంగా సాగుతోంది. తెలియని అమాయక యువత అదృష్టం ఉంటే రూ.లక్షలు సంపాదించుకోవచ్చనే క్షణికావేశంతో బెట్టింగ్ వేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ఉండే బెట్టింగ్ బుకీలు ఆయా ప్రాంతాల వారీగా మధ్యవర్తులను నియమించుకుని వారి ద్వారా బెట్టింగ్ తతంగాన్ని నడిపిస్తున్నారు. స్ట్రైట్, రైసింగ్, 30, 50, ఎస్, ఓకే, డన్ వంటి కోడ్‌లను ఉపయోగిస్తూనే ఈ బెట్టింగ్ అంతా సాగుతోంది. కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో లాడ్జీలలో ఈ బెట్టింగ్ తంతు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్ల మైదానాల్లో సాయంత్రం పూట యువత చేరి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇవ్వడం కూడా ఎక్కడా కనిపించడం లేదు. బెట్టింగ్ ద్వారా ఓ వైపు బుకీలు రూ.లక్షలు, రూ.కోట్లలో సంపాదిస్తుంటే యువత మాత్రం అప్పు చేసి మరీ బెట్టింగ్ కాస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.



మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే మెగా డిఎస్‌సి తో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువకులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే ప్రతేడాది ఖాళీలన్నింటినీ కలిపి డిఎస్‌సి, గ్రూప్ 2 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా డిఎస్‌సి, గ్రూప్ 2 నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. డిసెంబర్ 22న పార్లమెంటులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర డివైఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షులు ఎంఎ. రహీం రాజ్యసభ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆంధ్రప్రదేశ్‌లో 50,667 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కానీ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని అడుగుతే కేవలం 774 పోస్టులే ఖాళీగా ఉన్నట్లు నిరుద్యోగులను మోసం చేసే విధంగా కుట్రపూరితమైన సమాధానం చెప్పారని తెలిపారు. ఇలాంటి అసంబద్ధ ప్రకటనలను మానేసి వాస్తవంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే రూ.25వేల పోస్టులతో డిఎస్‌సి ప్రకటించాలని 5600 పోస్టులతో గ్రూప్ 2 ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్ 20 నుండి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు నిరుద్యోగులతో చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, నగర కార్యదర్శి హుస్సేన్ బాష, జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ శంకర్, నాయకులు విక్రం, మధు, రాము, శివ,శ్రీను, రాజు, తిమ్మప్ప, నగర అధ్యక్షులు అమర్ నాయకులు తేజ డీఎస్సీ గ్రూప్ 2 నిరుద్యోగులు పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేపడుతున్న నాయకులు



ఆలూరులో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

10వ తరగతి పరీక్షలు సోమవారం నాడు ప్రారంభమయ్యాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పదవతరగతి పరీక్షలు జరిగాయి. 149 పరీక్ష కేంద్రాల్లో మొదటిరోజు జరిగిన పరీక్షకు 29417 మంది విద్యార్థులు హాజరు కాగా 447 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతి పరీక్షల పరిశీలకుడు జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. లైన్స్ క్వార్డు బందాలు దాదాపుగా 44 పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి పేర్కొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి

- డిఆర్ఒ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లిఖార్జునుడు, అనురాధ, రమ తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి , మండల స్థాయి అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలను బియాండ్ ఎస్–ఎల్ఎ వెళ్లకుండా చూడాలన్నారు. ఏ అర్జీకూడా రీఓపెనింగ్‌కు ఆస్కారంలేకుండా పరిష్కరింపబడాలన్నారు. అర్జీలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టిపరిస్థితిలో పెండింగ్‌లో ఉండకూడదని, వచ్చినవి వచ్చినట్లు ఏ రోజుకారోజు పరిష్కరించాలని డిఆర్ఒ ఆయా శాఖల అధికారులకు సూచించారు.



వినతులను స్వీకరిస్తున్న డిఆర్ఒ నాగేశ్వరరావు

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు జిల్లా గార్గేపురం నుండి కేతవరం వెళ్లే ప్రధాన రహదారిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిఐటియు జిల్లా నాయకులు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్ వీరన్నకు వినతి పత్రం అందజేశారు. జి.శ్రీధర్ మాట్లాడుతూ గార్గేపురం నుండి కేతవరం వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కనే నేలకొరిగిన స్తంభాలకు మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టాలని ఆన్నారు. నిత్యం రద్దీగా తిరిగే ట్రాక్టర్లు ,ఆటోలు, బైకులు పొలాలకు వెళ్లే రైతులు కూలీలు ఏ క్షణానైనా విద్యుత్ స్తంభాలు మీద పడే ప్రమాదం ఉందన్నారు. లేనిచో విద్యుత్ ఆఫీసును ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. స్పందించిన ఎడి తక్షణమే అక్కడున్న అధికారులకు ఫోన్ చేసి సాయంత్రం లోపల స్తంభాలకు మరమ్మతులు పూర్తి చేయాలని చెప్పారు. సిఐటియు మండల కార్యదర్శి షాజహాన్ నాయకులు సుధాకర్, శివన్న, శేఖర్, పవన్ పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న ఎస్ఇ.ఉమాపతి

క్రమశిక్షణకు మారుపేరు అంకితభావంతో నిరంతర పర్యవేక్షణ, ఉద్యోగులందరిని ప్రేమతో పల కరిస్తూ నవ్వుతూ అందరితో కలిసిపోయే వ్యక్తి కె.ప్రసన్న కుమార్ అని ఎపిఎస్‌పిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎం. ఉమాపతి అన్నారు. కర్నూలులో ఇఇ టెక్నికల్‌గా పని చేస్తున్న కె.ప్రసన్నకుమార్ నెల్లూరు జిల్లా నాయుడుపేట ఆపరేషన్ డివిజన్ ఇఇ గా బదిలీ పై వెళ్తున్న సందర్భంగా సోమ వారం విద్యుత్ భవన్లోని సమావేశ మందిరంలో ఆత్మీయవీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఎస్ఇ ఉమాపతి, ఈఈ,డిఈ లు మాట్లాడుతూ మిగతాభాషి, పనిని ప్రేమించే వ్యక్తి అని, అందరితో కలిసి మెలిసి ఉంటూ ఫైళ్లు ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చేసే మనస్తత్వంకల వ్యక్తి అని కొనియాడారు. ఎపిఎస్‌పిడిసిఎల్ పనిచేసే ఈఈలు, డిఇలు విజయభాస్కర్, కాంట్రాక్టర్లు ఉద్యోగులుపాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన ఆటో ఒకరి మృతి

ప్రజాశక్తి -సి బెళగల్

కర్నూలులో పనులు ముగించుకొని బైకుపై సి బెళగల్‌కు బయలు దేరాడు. కేవలం ఐదు నిమిషాల్లో ఇంటికి చేరాల్సినోడు..రోడ్డు ప్రమాదంలో కాటికి చేరాడు. వివరాల్లోకి వెళితే సి.బెళగల్ కు చెందిన టైలర్ నాయక్ అలీ (46) ఇటీవల చిన్న కొడుకుకు ఎంగేజ్‌మెంట్ చేసాడు. భార్య,పెద్ద కొడుకు కొడుకు(మనవడిని)వెంట పెట్టుకొని పెళ్లి విషయమై కర్నూలులో బంధువులతో మాట్లాడేందుకు వెళ్లాడు. సోమవారం తిరిగి వస్తుండగా బెళగల్ కు సమీపంలో హెచ్ పి పెట్రోల్ బంకు దగ్గర వెనుక నుండి ఈర్లదీన్నేకు వెళ్లే ఆటో అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అలీ తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఎస్ఐ పీరయ్య క్షణాల్లో సిబ్బందితో అక్కడికి చేరుకొని తగు చర్యలు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ఆసుపత్రికి తరలించారు. కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

14 నుంచి జిల్లాలో నారాలోకేష్ యువగళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి, వేదికపై బీదరవిచంద్రయాద్ తదితరులు


ఈనెల 14 నుంచి కర్నూలు జిల్లాలో నారాలోకేష్ యువగళం పాదయాత్ర ఉంటుందని తెలుగుదేశం శ్రేణులు సమిష్టిగా పని చేసి విజయవంతం చేయాలని పాదయాత్ర నిర్వహణ కమిటీ సభ్యులు ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదరవిచంద్రయాదవ్ సూచించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తెలుగు దేశం పార్టీ నియోజకవర్గం ఇన్చార్జీలు, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు, పరిశీలకుల సమావేశం కర్నూలు నగరంలోని హెరిటల్ మౌర్యాయిన్ పరిణయ హాల్‌లో పార్టీ రెండు పార్లమెంట్ నియోజక వర్గాల అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు (కర్నూలు), గౌరు వెంకటరెడ్డి (నంద్యాల) ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శినారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహించే అంశంపై చర్చించారు. వారు మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర 59 రోజులు 750 కి.మీ. మేరకు చిత్తూరు, అనంతపురం జిల్లాలో కొనసాగిందని తెలిపారు. ఈ నెల 14 తేదీన లోకేష్ పాదయాత్ర కర్నూలు జిల్లాలోని బనగానపల్లె నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. ఆయన పాదయాత్ర జిల్లాలో 14 నియోజకవర్గాలలో కొనసాగేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని పార్టీ నియోజకవర్గం ఇన్చార్జీలకు సూచించారు. ఇన్చార్జీలు రూపొం దించిన రూట్ మ్యాప్‌ను రాష్ట్ర పార్టీ పరిశీలనకు పంపించి నచో వారు సంభందిత ప్రాంతాలను పరిశీలించి ఫైనల్ చేస్తారని అన్నారు. ముందుగా నియోజకవర్గం ఇన్చార్జీలు కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలనే దానిపై పూర్తిగా నిర్ణయించుకోవాలని ఖచ్చితంగా ప్రతి నియోజకవర్గంలో ఒక భహిరంగ సభ ఉండేలా చూడాలనీ, కొన్ని నియోజకవర్గాలలో విద్యార్థులతోను, వివిధ సామాజిక వర్గాల వారు ఎదుర్కొం టున్న ప్రధాన సమస్యలపై స్థానికులను ప్రభావితం చేసే అంశాలను చర్చించే నిమిత్తం వారితో సమావేశ మయ్యేలా కార్యక్రమంలో పొందుపర్చాలని తెలిపారు. ఇప్పటి వరకు లోకేష్ పాదయాత్ర రోజు రోజుకు వూహించిన దానికంటే ప్రజలు ఎక్కువగా ముందుకు వచ్చి తమ సమస్యలను జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వారి దృష్టికి తెస్తున్నారని తెలిపారు. కర్నూలు జిల్లాలో కూడా పార్టీ నాయకులంతా సమిష్టిగా లోకేష్‌కు స్వాగతం పలికేందుకు, పాదయాత్రను ప్రణాళికా బద్ధంగా విజయవంతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమములో నాయకులు జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, కర్నూలు పార్లమెంట్ ఎం. శివానందరెడ్డి, నంద్యాల పార్లమెంట్ పార్టీ ఇన్చార్జీలు కర్నూలు టిజి. భరత్ పత్తికొండ కెయి శ్యామ్ కుమార్ కోడుమూరు అకెపోగు ప్రభాకర్ ఎమ్మిగనూరు బి వి జయనాగేశ్వరరెడ్డి మంత్రాలయం పి.తిక్కారెడ్డి , ఆలూరు కోట్ల సుజాతమ్మ ఆదోని జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి కె భూపాలౌచౌదరి, శ్రీశైలం బుడ్డా రాజశేఖరరెడ్డి నందికోట్కూర్ కో–ఆర్డినేటర్ గౌరు వెంకటరెడ్డి, పాణ్యం గౌరు చరితరెడ్డి నంద్యాల భూమా బ్రహ్మానందరెడ్డి, బనగానపల్లె బిసి జనార్ధన్‌రెడ్డి, డోన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ లు ఎస్ఎండి. ఫారూక్, కె యి. ప్రభాకర్, బిటి. నాయుడు, భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌ల పై స్పెషల్ డ్రైవ్

మూడు రోజుల్లో 99 కేసులు నమోదు

160 మంది అరెస్టు-రూ.43 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగుల పై గత 3 రోజులుగా కర్నూలు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అన్నారు. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన వివరాలను ఆయన సోమవారం విడుదల చేశారు. పేకాటకు సంబంధించి 68 కేసులు, 116 మంది అరెస్టు, 18 లక్షలు సీజ్ చేశారని పేర్కొన్నారు. మట్కాకు సంబంధించి 25 కేసులు, 38 మంది అరెస్టు, 22 లక్షలు , 779 మద్యం బాటిల్స్ , 20 కర్ణాటక టెట్రా ప్యాకెట్స్, 15 లీటర్ల సారా సీజ్ చేశామన్నారు. క్రికెట్ బెట్టింగ్ కు సంబంధించి 6 కేసులు ,6 మంది అరెస్టు, 3 లక్షలు, 12 మొబైల్స్ సీజ్ చేశామని చెప్పారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగు, మట్కా, పేకాట , తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. పేద, సామాన్య ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసే మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ కట్టడి కోసం కర్నూలు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లా కేంద్రం నుండి ప్రత్యేక పోలీసు బృందాలను పంపి దాడులు చేయిస్తున్నామన్నారు. జిల్లాలోనే కాకుండా కర్నాటక, తదితర ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకుని గుట్టుగా కార్యకలాపాలు సాగిస్తున్న వారి పై ప్రత్యేక దష్టిసారించామన్నారు. బహిరంగ ప్రదేశాలలో పేకాట ఆడుతున్న వారిపై ప్రత్యేక నిఘాతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్ముందు పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్ ల పై మరింత గట్టిగా పని చేస్తామన్నారు. ఇటువంటి వాటిపై గామ్లింగ్ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నామన్నారు. పేకాట లో రూ. 18 లక్షలు, మట్కా లో రూ. 22 లక్షలు. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల నుండీ రూ. 3 లక్షలు మొత్తం 3 రోజుల స్పెషల్ డ్రైవ్ లో రూ.43 లక్షలు సీజ్ చేశామని తెలిపారు. చాక చక్యంగా పని చేసిన పోలీసుఅధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుద్ఘాతానికి పశువులు మృతి

రూ.రెండు లక్షల దాకా ఆస్తి నష్టం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మం డలం శభాష్ పురం గ్రామ పంచాయతీ పైచింతల కొండ గ్రామంలో సో మవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రావడంతో గొర్ల రామన్న రైతుకు చెందిన ఎద్దులు, మేకలు, కోళ్లుమంటలోనే దగ్ధం అయ్యాయి. గుడిసెలో ఉన్న పశువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రైతు గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈలోపు అవన్నీ పూర్తిగా కాలిపోయి బూడిద అయ్యాయి. దీంతో రైతుకు రెండు లక్షల దాకా ఆస్తినష్టం వాటిలింది. విషయం తెలుసుకున్న సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచి సలహాదారుడు రవి, విఆర్ఒ రామాంజనేయులు గ్రామ ప్రజలు రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. కూ.పదివేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు మాట్లాడుతూ ఈ దుర్ఘటనను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి తెలియజేస్తామని, ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్సూరెన్స్ తెప్పించే మార్గం చేస్తానని రైతుకి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పది పరీక్ష కేంద్రాలను ఉప విద్యాధికారి తనిఖీ

ప్రజాశక్తి- సి బెళగల్



మండలంలోని కొత్తకోట–1 , 2 పరీక్షా కేంద్రాలు, బెళగల్ లోని మోడల్, గురుకుల, హైస్కూల్ పదోతరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా ఉప విద్యాధికారి హనుమంతరావు సోమవారం తనిఖీ నిర్వహించారు.మండలంలో 1071 మంది పరీక్షలు రాస్తున్నారని అందులో ఏడుగురు గైర్హాజరుఅయ్యారు. పక్కడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

కంటి వెలుగు , వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి-మద్దికెర

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మద్దికెర వైద్యాధికారి డాక్టర్ నగేష్ ఆదేశానుసారం ఆప్తాల్మిక్ ఆఫీసర్ రమేష్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా హంప సచివాలయంలో సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు, వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 సంవత్సరాలు పైబడిన అందరికీ కంటి వెలుగు కార్యక్రమం కింద కంటి పరీక్షలు నిర్వహించారు. అర్హులైన అందరికీ కంటి అద్దాలు పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా వడదెబ్బ తగలకుండాజాగ్రత్తలు తీసుకోవాలని పిల్లలు, గర్భవతులు, బాలింతలు, వృద్ధులు ఎండకు తిరగరాదని అత్యవసరమైతే టోపీలు ధరించాలని, కంటి అద్దాలు వాడాలని, తలపై రుమాలు వేసుకోవాలని ,కాటన్ దుస్తులు ధరించాలని, అతిశీతల పానీయాలు తీసుకోరాదని, ప్రయాణాలు తగ్గించాలని, వడదెబ్బపై ఆరోగ్య విద్య అవగాహన కలిగించారు. అనంతరం ఒఆర్ఎస్ తయారీపై, ఒఆర్ఎస్ ద్రావణ ప్రాముఖ్యతను వివరించారు. ఒఆర్ ఎస్ ప్యాకెట్లు అన్ని అంగన్వాడీ కేంద్రాలు సచివాలయాలు ఆశా కార్యకర్తల వద్ద ఉచితంగా లభిస్తున్నట్లు తెలిపారు.

రీ సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

రీసర్వే సమస్యల పరిష్కారానికి మొబైల్ మెజిస్ట్రేట్, రీ సర్వే ఉప తహశీల్దార్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్జీ సమస్యలను వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. రీ సర్వేలో ఏదైనా సమస్యలు వస్తే సంవత్సరంలోపు ఆయా మండలానికి సంబంధించి మొబైల్ మెజిస్ట్రేట్, రీ సర్వే ఉప తహశీల్దార్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. పరిపాలన అధికారి గోవిందు సింగ్, డిఎల్‌పిఒ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ, సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.

పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి

- ఆలూరు సిడిపిఒ లలిత



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిడిపిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

వేసవి ఈ రెండు నెలలు కూడా పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి తీసుకొచ్చినప్పటి నుంచి మళ్లీ ఇంటి దగ్గరకు చేర్చేంత వరకు నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సిడిపిఒ లలిత అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు సూచించారు. సోమవారం నేమకల్లు గ్రామంలోని మూడు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కేంద్రాల పనితీరు గురించి కేంద్రాల దగ్గర ఉన్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు కేంద్రానికి వచ్చి తప్పనిసరిగా తిని వెళ్లాలని సూచించారు. పిల్లలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. మండలంలో కొంతమంది అంగన్వాడీ టీచర్లు సమయానికి కేంద్రాలకు చేరుకోవడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అలాంటి వారు పద్ధతి మార్చుకోకపోతే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్లు బాల రంగమ్మ, వన్నూరమ్మ, పార్వతి, ఆయాలు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ఓ తేనెధార

- ఎంఇఒ కోమలదేవి



'తేనెధారలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఇఒ, కవులు, రచయితలు

ప్రజాశక్తి-ఆలూరు

తెలుగు సాహిత్యంలో ప్రతి అక్షరం ఓ తేనెధార అని ఎంఇఒ కోమలదేవి, కవి, రచయిత ఎస్.ఈరన్న తెలిపారు. సోమవారం ఆలూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన 'తేనెధారలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన 32వ నూతన పుస్తకం 'తేనె ధారలు' బాలగేయాల సంకలనాన్ని ఆవిష్కరించారు. ఎంఇఒ కోమల దేవి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కృష్ణ కుమార్, కమలా కళానికేతన్ వేదిక అధ్యక్షులు, ప్రముఖ కవి, బహు పుస్తకాల రచయిత ఎస్.ఈరన్న చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. అనతి కాలంలో 32 పుస్తకాలు ప్రచురించడమే కాకుండా బాలసాహిత్యంలో విశిష్ట సేవలందించిన గద్వాల సోమన్న సాహితీ సేవలను కొనియాడారు. అనంతరం రచయిత గద్వాల సోమన్నను శాలువాతో సన్మానించారు. మొలగవల్లి గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ రామమూర్తి, పద్య కవి ఈశ్వరప్ప, సంస్కృత పండితులు బిటి.లక్ష్మన్న, నరసన్న, డేనియల్ పాల్గొన్నారు.

మరో ఉద్యమానికి నాంది... కార్మిక, కర్షక ఢిల్లీ పోరాటం..

- సిఐటియు రాష్ట్ర నాయకులు గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - దేవనకొండ

ఈనెల 5న ఢిల్లీలో జరిగే మజ్దూర్, కిసాన్ (కార్మిక, రైతు) పోరాటం రైతు, కార్మికుల హక్కుల సాధన ఉద్యమానికి నాంది అని, ప్రజలంతా ఈ ఆందోళనను బలపరచాలని సిఐటియు రాష్ట్ర నాయకులు డి.గౌస్ దేశాయి, వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి కోరారు. ఈనెల 5న ఢిల్లీలో జరిగే పోరాటానికి కోటకొండ, దేవనకొండ, తెర్నేకల్ గ్రామాల నుంచి 46 మంది రైతు సంఘం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు సోమవారం వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఢిల్లీ పోరాటానికి వెళ్తున్న వారిని ఘనంగా సాగనంపుతూ డప్పులతో ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలో కార్పొరేట్ల ప్రభుత్వం ఉందని, బడుగు, బలహీన వర్గాలు, రైతు, కార్మిక, కర్షకులు ఇబ్బందులు ఎదుర్కొంటూ దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు. దేశ సంపదనంతా ఒక వర్గానికి కట్టబెడుతూ దేశ ప్రజలను బజారులో నిలబెడుతోందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న ఈ నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోరాటం రాబోయే రోజుల్లో తీవ్రంగా మారనుందని చెప్పారు. ప్రజా సంఘాల నాయకులు మహబూబ్ బాషా, యూసుఫ్, ఓంకార్, బజారి, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, చిన్న ఎల్లప్ప, సుభాన్, మల్లి, గోవిందు పాల్గొన్నారు.



ఢిల్లీకి తరలి వెళ్తున్న నాయకులు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీతారామిరెడ్డి

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

- వైసిపి రాష్ట్ర నాయకులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని వైసిపి రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి మురళీమోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి అయ్యమ్మ అధ్యక్షతన ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవిలో చలివేంద్రం ప్రజలు దాహార్తిని తీర్చడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సర్పంచి అయ్యమ్మ మాట్లాడుతూ... వేసవి పూర్తయ్యేంత వరకు చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. ఎంపిపి ఈరన్న, వైసిపి సీనియర్ నాయకులు ఎస్.మాణిక్యరాజు, మాజీ జడ్‌పిటిసి మంగమ్మ, వైసిపి నాయకులు వక్రాని వెంకటేష్, యువ నాయకులు రాజేష్, సంజిపోగు తిక్కయ్య, ఇర్మియా, రహీం పాల్గొన్నారు.

ఆర్‌ఒఆర్ కేసు నమోదు చేయండి

- తహశీల్దార్‌కు బాధితుల వినతి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై ఆర్‌ఒఆర్ కేసు నమోదు చేసి తమ ల్యాండ్ సీలింగ్ భూమి తమకు ఇప్పించాలని బాధితులు కోరారు. సోమవారం తహశీల్దార్‌లో నిర్వహించిన స్పందనలో మండలంలోని జాలవాడి గ్రామానికి చెందిన తలారి మునెమ్మ తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పేద కుటుంబమైన తమకు 1977లో ప్రభుత్వ భూమి పంపిణీలో భాగంగా గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 2-2సిలో 2.18 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూమిని తన భర్త కీర్తిశేషులు ప్రసంగి పేరు మీదుగా పట్టా మంజూరు చేశారని తెలిపారు. తన పొలం పక్కన మంత్రాలయం మండలం వగరూరు గ్రామానికి చెందిన కురువ అయ్యప్పకు 1992లో కౌలుకు ఇచ్చామని చెప్పారు. కురువ అయ్యప్ప తప్పుడు అగ్రిమెంట్ పుట్టించుకుని తన భర్త దగ్గర పట్టా లాక్కొని సంతకాలు చేయించుకొని రాజకీయ పలుకుబడితో గ్రామ రెవెన్యూ రికార్డులో కురువ నాగప్ప పేరు మీద అడంగల్ వన్ బిని సృష్టించారని తెలిపారు. తక్షణమే ఆయనపై ఆర్‌ఒఆర్ కేసు నమోదు చేసి, తమ భూమి తమకు ఇప్పించాలని కోరారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు అవసరం

- నారాయణ పాఠశాలల ఎజిఎం రమేష్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని నారాయణ పాఠశాలల ఎజిఎం రమేష్ కుమార్ తెలిపారు. కర్నూలు నగరంలో రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన నారాయణ ప్రీమియర్ లీగ్‌లో ఆదోని నారాయణ విద్యా సంస్థ ప్రతిభ చాటింది. స్కిప్పింగ్ రేస్‌లో మొదటి బహుమతిని 4వ తరగతి చదువుతున్న హిమశ్రీ గెలుపొందారు. రెండో బహుమతి సాయి జ్ఞానేశ్వరి సాధించారు. బాలుర విభాగంలో 5వ తరగతి చదువుతున్న జీవన్ మొదటి బహుమతి సాధించారు. డాగ్ ద బాల్ రేస్ విభాగంలో 2వ తరగతి చదువుతున్న ఎస్‌కె.మధిహ ఫిర్దోస్, 1వ తరగతి చదువుతున్న శశి ప్రియ రెండో బహుమతి సాధించారు. అలానే బాలుర విభాగంలో 2వ తరగతి చదువుతున్న ఈరన్న, ఖాదర్ బాషా మొదటి బహుమతి సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ జాఫర్ ఆధ్వర్యంలో పిఇటి ప్రసాద్ విద్యార్థులకు శిక్షణ అందించడంతో తమ పిల్లలు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నట్లు రమేష్‌కుమార్ సోమవారం తెలిపారు.



ఎంఇఒ కార్యాలయ సిబ్బందికి వేతనాలు పెంచాలి

- కార్యాలయం ఎదుట సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గత కొన్నేళ్లుగా మండల విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని సోమవారం నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమగ్ర శిక్షలోని మండల విద్యాశాఖ కార్యాలయాల్లో మెసెంజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎంఐఎస్, సిఆర్‌పిలు, అకౌంటెంట్, ఐఇ కోఆర్డినేటర్‌గా పనిచేసే సిబ్బంది అందరూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్లానింగ్ అప్రూవల్ బడ్జెట్‌లో మెసెంజర్ పోస్టును అప్రూవ్ చేయాలని కోరారు. ఏడేళ్ల నుంచి ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని తెలిపారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, 16 ఏళ్ల సర్వీసు అయినా సమాన పనికి సమాన వేతనం లేదని చెప్పారు. మహ్మద్ రఫీ, బీచుపల్లి, శాంత కుమార్, మహ్మద్ గౌస్, నల్లన్న, నాగవేణి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం...

- వైసిపి రాష్ట్ర నాయకులు సీతారామిరెడ్డి
- వైఎస్ఆర్ ఆసరా అందజేత

ప్రజాశక్తి - కోసిగి రూరల్

రాష్ట్రంలోని మహిళలందరినీ లక్షాధికారులను చేయడంతో పాటు మహిళా సాధికారత లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైసిపి రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. సోమవారం కోసిగిలోని మార్కెట్ యార్డులో ఎపిఎం సత్యమ్మ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కును అందజేశారు. సర్పంచి ఎస్.అయ్యమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిలుగా సీతారామిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి హాజరయ్యారు. వారికి మహిళలు, అధికారులు, నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందన్నారు. కోసిగిలో ఉన్న 869 పొదుపు గ్రూపులకు దాదాపు రూ.5.35 కోట్లు మహిళల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఎంపిపి ఈరన్న, జడ్‌పిటిసి పవిత్ర, సింగిల్ విండో అధ్యక్షులు మహంతేష్ స్వామి, బెట్టనగౌడ్, నాడిగేని నరసింహులు, మాజీ జడ్‌పిటిసి మంగమ్మ, మాణిక్యరాజు, నాడిగేని నాగరాజు పాల్గొన్నారు.

ఆలూరు : వైఎస్ఆర్ ఆసరా 3వ విడత చెక్కును సోమవారం ఇబ్రహీం ఫంక్షన్ హాలులో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ఆర్ ఆసరా మూడో విడత అందజేస్తున్నట్లు తెలిపారు. కుటుంబంలో సుస్థిరమైన ఆదాయం రావాలని, సొంతంగా సృష్టించుకునే వ్యాపార, జీవన ఉపాధి అవకాశాలకు ఈ డబ్బును ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, ఎంపిపి రంగమ్మ, మండల కన్వీనర్ వీరేష్, మొలగవల్లి ఈరన్న, ఎపిఎం ఆంజనేయులు పాల్గొన్నారు.



కోసిగిలో పొదుపు మహిళలకు చెక్కును అందజేస్తున్న వైసిపి నాయకులు



ఆలూరులో మహిళలకు చెక్కు అందజేస్తున్న నాయకులు

ఇరు వర్గాలపై కేసులు నమోదు

- ఎస్ఐ మహేష్ కుమార్

ప్రజాశక్తి - నందవరం

నందవరం కుమ్మరి వీధిలో గత నెలలో జరిగిన గొడవలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంపాపతి జాతర సందర్భంగా మార్చి 30న గ్రామంలో మునిస్వామి టాకీస్ నుంచి రోడ్లకు ఇరువైపులా మట్టిని తీస్తుండగా వడ్డే మురళీ 'నా ఇంటి ముందు మట్టి తీస్తే గుంతలు పడతాయ'ని అనడంతో ఉప సర్పంచి శివారెడ్డి గౌడ్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుందని తెలిపారు. దానిని దృష్టిలో పెట్టుకొని మరుసటి రోజు మురళీపై శివారెడ్డి గౌడ్, వారి అనుచరులు సుందర్ రాజు, బుజ్జిబాబు, భాస్కర్, నాగరత్నం, ఆదాము, శాంతి దాడి చేశారని ఫిర్యాదు చేశారని చెప్పారు. అలాగే 'మేము జీవనోపాధి నిమిత్తం రోడ్డు పనులు చేస్తుండగా మురళీ, రవికుమార్ కొంతమంది ప్రోత్సాహంతో కులం పేరుతో దూషించార'ని మురళీ, వడ్డే రవి కుమార్, పుష్పవతి, జగదీష్, మల్లికార్జునపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారన్నారు. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని తెలిపారు.

14న అంబేద్కర్ జయంతికి సన్నాహాలు

- నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 14న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ మాదిగ తెలిపారు. సోమవారం స్థానిక పరిమళ పార్కు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి విజయభేరి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఛైర్మన్‌గా సన్నక్కి కర్రెన్న, కమిటీ కన్వీనర్‌గా దేవపుత్ర, కో కన్వీనర్‌గా సంపత్, సింగరాజుపల్లి రాజు, పెద్ద తాయన్న, కార్యదర్శులుగా శ్యామ్సన్, ప్రకాష్, భాస్కర్, రామాంజనేయులును ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం జయంతి ఉత్సవ కరపత్రాలను విడుదల చేశారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి రాజగోపురం నిర్మాణానికి భక్తుడు విరాళం ఇచ్చినట్లు ముఖ్య అర్చకులు ఈరన్న స్వామి తెలిపారు. సోమవారం ఆదోని మండలం పెండేకల్లు గ్రామానికి చెందిన సరోజమ్మ, రంగారెడ్డి దంపతులు రూ.1,00,116 అందజేశారన్నారు. దేవాలయంలో దాతల పేరున ప్రత్యేక పూజలు చేశారు. పుణ్యక్షేత్రంలో రాజగోపురం నిర్మాణంతో పాటు అన్నదానం, అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భక్తులు విరాళాలు అందించి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు.

ఎలీషా మృతి టిడిపికి తీరని లోటు

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

కౌతాళం : మండలంలోని అగసలదిన్నె గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ దళిత నాయకులు ఎలీషా మృతి టిడిపికి తీరని లోటని టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు గోతులదొడ్డి ఉలిగయ్య సోమవారం పేర్కొన్నారు. ఎలీషా కుటుంబం సర్పంచిగా, ఎంపిటిసిగా గ్రామానికి సేవలు అందించారని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని చెప్పారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అలాగే పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

హమాలీ కార్మికులకు ఉపాధి కల్పించాలి : సిఐటియు

ఆదోని : సెంట్రల్ వేర్‌హౌస్ గోదాముల్లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు సీనియర్ నాయకులు బి.మహానందరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, ఉపాధ్యక్షులు డి.లక్ష్మన్న, సిడబ్ల్యుసి అధ్యక్షులు మారెన్న డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనేక ఏళ్లుగా దాదాపు 70 మంది హమాలీ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారని తెలిపారు. కరోనా కాలం నుంచి ప్రయివేట్ గోదాములను స్టాక్ పాయింట్‌గా నిర్వహించడం వల్ల 70 కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం గతం నుంచి అమలవుతోందన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న బియ్యాన్ని ప్రయివేట్ గోదాములకు కాకుండా సిడబ్ల్యుసి గోదాముల్లో నిల్వ చేయించి హమాలీ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. హమాలీలు జిసి.కిష్టప్ప, ఎస్.అంజిని, వై.దానప్ప, బి.నాగరాజు, కెబి.చంద్ర, రమేష్, మల్లి, లక్ష్మన్న, కెవి.నాగరాజు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలి

- సబ్ కలెక్టర్‌కు ఫెడరేషన్ వినతి

ఆదోని : జర్నలిస్టులకు ప్రభుత్వం జారీ చేసే అక్రిడిటేషన్ కార్డుల ఎంపిక కమిటీలో ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని యూనియన్ ఆదోని అధ్యక్ష, కార్యదర్శులు బసవ రాజు, మునెప్ప కోరారు. సోమవారం యూనియన్ నాయకులు ఉరుకుందప్ప, ఎంకె.ఆంజనేయులు, షంషేర్ ఖాన్, మల్లికార్జున, రమేష్ రెడ్డితో కలిసి ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో కమిటీలో యూనియన్ తరపున సభ్యులకు ప్రాతినిధ్యం ఉన్నా ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన జిఒలో పేర్కొనకపోవడం సమంజసం కాదన్నారు. వేలాదిమంది జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు యూనియన్‌కు కార్యవర్గం ఉందన్నారు. ఏ యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వానికి వినతి పత్రం పంపుతామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హామీ ఇచ్చారు. నాయకులు సుధాకర్, వాల్మీకి సుధాకర్, రఘునాథ్ రెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

- ఆదోని 17 సెంటర్లలో 25 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద హాల్ టికెట్ నెంబర్లను గదిలోకి వెళ్లే ముందు చూసుకునేందుకు పెద్ద బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కేవలం కంప్యూటర్‌లో తీసిన పేపర్‌ను గోడకు అతికించి ఉంచారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్లు చూసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్లు కనిపించకపోవడంతో ప్రధానోపాధ్యాయులును విచారించగా నెంబర్లు ఉన్నాయని బోర్డుపై పొందుపరిచారు. 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 3,673 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఇందులో 25 మంది గైర్హాజరయినట్లు ఆదోని ఉప విద్యాశాఖ అధికారి సుకుమార్, ఎంఇఒ శివరాములు తెలిపారు. ప్రయివేట్‌గా రాసే విద్యార్థులు 46 మందికి గాను ఆరుగురు గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, వైద్య సిబ్బందిని ఉంచామన్నారు. ఉప విద్యాశాఖ అధికారి సుకుమార్, ఎంఇఒ శివరాములు మున్సిపల్ హై స్కూల్, నెహ్రూ మెమోరియల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. **నందవరంలో** పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మూడు పరీక్ష కేంద్రాల్లో 380 మందికి గాను 373 మంది పరీక్షలు రాశారని, ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఇఒ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా, పోలీసు బందోబస్తు మధ్య పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్లు నాగభూషన్ రెడ్డి, శ్రీనివాసులు, దేవకృపమ్మ, డిపార్ట్‌మెంటల్ అధికారులు కాశయ్య, నాగరాజు, హరిప్రసాద్ పాల్గొన్నారు. **హోళగుంద** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఎ' సెంటర్‌లో 150 మంది రెగ్యులర్, ఆరుగురు ప్రయివేట్ విద్యార్థులు ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు. 'బి' సెంటర్‌లో 165 మంది పరీక్షలు రాయగా ముగ్గురు గైర్హాజరయ్యారు. కెజిబివిలో 140 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఒకరు గైర్హాజరయ్యారు. కన్నడ మెయిన్ స్కూల్‌లో 109 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇద్దరు గైర్హాజరయ్యారు. కర్రి బసప్ప, రామయ్య, లక్ష్మీనారాయణ, డాక్టర్ హుస్సేనిలు ఎగ్జామినేషన్ చీఫ్‌లుగా వ్యవహరించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. **ఆలూరు** పట్టణంలో మొత్తం 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 847 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 824 మంది మాత్రమే హాజరయ్యారు. 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. **చిప్పగిరి**లోని రెండు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం పరీక్ష కేంద్రాల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. రెండు పరీక్ష కేంద్రాల్లో ఎగ్జామ్ చీఫ్‌లుగా గీరయ్య, మోహన్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా ప్రకాష్, రంగస్వామి పరీక్షలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 236 మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారని చెప్పారు. కెజిబివి పాఠశాలలో 72 మందికి 72 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, ఎఎన్ఎం, ఒక ఆశా కార్యకర్తను ఏర్పాటు చేశామన్నారు. ఎంఇఒ మస్తాన్‌రావు పాల్గొన్నారు. **ఆస్పరి**లో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలవ్యాప్తంగా 660 మంది విద్యార్థులకు గాను 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 'ఎ' సెంటర్‌లో 280 మంది విద్యార్థులకు గాను 278 మంది, 'బి' సెంటర్‌లో 225కు గాను 223 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల 'సి' సెంటర్‌లో 215కు గాను 214 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంకా ఐదుగురు విద్యార్థులు హాజరు కాలేదని పరీక్ష కేంద్రాల ఇన్విజిలేటర్స్ సుజాత, వెంకటరమణ, హనుమంతు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉండడంతో విద్యార్థులు 9 గంటల్లోపే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది కేంద్రాల ద్వారాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద అన్ని వసతులూ కల్పించారు.



నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఆస్పరిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S NO. 721/ 2019

S.సురేష్. ...వాది

-Vs-

M.శ్రీనివాస రెడ్డి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

M. శ్రీనివాస రెడ్డి హెడ్ కానిస్టేబుల్ నెం. 2386, సి.బెళగల్ పోలీస్ స్టేషన్, సి.బెళగల్ గ్రామం మరియు మండలం కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 25,500/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 10-4-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 10-4-2023

M.R.కృష్ణ,
S.పాపన్న
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S NO. 489/ 2022

CH. భీమయ్య. ...వాది

-Vs-

B. దివాకర్. ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

B.దివాకర్ తండ్రి B. పాండురంగ విఠల్, వ్యాపారం, ఇంటి నెం. 51-15-A -18-12, వాణిజ్య నగర్, వాణిజ్య నగర్ గేట్ ఎదురుగా మహీంద్ర ట్రాక్టర్ షోరూమ్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 41,560/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 16-5-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 16-5-2023

M.M.అలీబేగ్,
వాది పరం న్యాయవాది, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.P NO.11/ 2023

B.పురుషోత్తంసింగ్ @ చిన్న. ...అర్జీదారు

-Vs-

B.విజయ్ వగైరా. ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబరు I.P లో అర్జీదారు అయిన B. పురుషోత్తంసింగ్ @ చిన్న తండ్రి B. సుభాన్ సింగ్ , కూలీ, ఇంటి నెం. 3-5, బి.తాండ్రపాడు కర్నూలు మండలం మరియు జిల్లా, అను నతడు తనను దివాళ దారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టు లో దివాళ అర్జీదాఖలు చేసినాడు. ఇందులో అర్జీదారు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 8-5-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూల ముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 8-5-2023

B.K.నాగరాజు
అర్జీదారు పరం న్యాయవాది, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S NO.119/ 2020

M.సర్వేశ్వర్ రెడ్డి. ...వాది

-Vs-

E.C.మల్లికార్జున శెట్టి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

E.C.మల్లికార్జున శెట్టి తండ్రి E.లక్ష్మీ నారాయణ శెట్టి, ఇంటి నెం. 2-2-6-11, మారుతీ రెసిడెన్సీ, బై రెడ్డి రైస్ మిల్ దగ్గర, బాలాజీ నగర్, కర్నూలు. ప్రస్తుతం. సి.బెళగల్ గ్రామం మరియు మండలం, చిన్న మల్లయ్య ఫ్లోర్ మిల్, కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 3,00,000/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 19-4-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందు మూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 19-4-2023

కనికె.రవికుమార్,
వాది పరం న్యాయవాది,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.P NO. 8/ 2023

1.అర్షిత్ విఠల్
2. C.అశోక్. ...అర్జీదారులు

-Vs-

G.చిన్న స్వామి @ తిమ్మప్ప మరియు వగైరా

...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబరు I.P లో అర్జీదారులు అయిన 1. అర్షిత్ విఠల్, 2.C.అశోక్ తండ్రి A. క్రిష్ణ ఇద్దరు భవానీ మెన్స్‌వేర్ ప్రొప్రయిటర్స్, ఇంటి నెం.81-259- A, రామచంద్రానగర్, కర్నూలు అను వారు తమను దివాళదారులుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టు లో దివాళ అర్జీదాఖలు చేసినారు. ఇందులో అర్జీదారులు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 12-5-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 12-5-2023

B.మురళీ మనోహర్,
N.C. రామదాసు,
అర్జీదారుల పరం న్యాయవాది,
కర్నూలు.



బెట్టింగ్ జోరు

- ఐపిఎల్‌తో మొదలైన పందేల పర్వం
- ఆర్థికంగా నష్టపోతున్న యువత



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

'నా కొడుకు ఇంటర్ వరకూ బుద్ధిగా ఉండేవాడు. ఆ తర్వాత ఇంట్లో మెల్లగా డబ్బు తీసుకెళ్లడం ప్రారంభించాడు. బయట కూడా దాదాపు రూ.లక్ష వరకూ అప్పు చేశాడు. మేం ఆర్థికంగా క్షీణించి వీధిన పడాల్సి వచ్చింది. చివరికి తెలిసింది క్రికెట్ బెట్టింగ్‌లో మొత్తం పోగొట్టుకున్నాడని.' ఇదీ ఓ తల్లి ఆవేదన. ఆ తల్లి మాత్రమే కాదు. క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలై అప్పుల పాలవుతున్న యువకుల తల్లిదండ్రులందరి ఆవేదనా ఇదే....

ఐపిఎల్ సీజన్ వచ్చిందంటే యువతలో జోరు అంతా.. ఇంతా కాదు. ఆ జోరును బెట్టింగ్ బుకీలు క్యాష్ చేసుకుంటున్నారు. మ్యాచ్‌లో సాగే బంతిబంతికీ పందేలు కాస్తున్నారు. ప్రస్తుతం ఐపిఎల్ ప్రారంభం రోజున కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మొదలైన క్రికెట్ బెట్టింగ్ ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ఊపందుకుంది. తొలుత క్రికెట్ అంటే మానసికోల్లాసం కోసం, క్రీడా స్ఫూర్తి కోసమే ఆడేవారు. నేడు అది జూద క్రీడగానూ మారిపోయింది. గతంలో పట్టణాలకే పరిమితమైన 'బెట్టింగ్ ఫీవర్' నేడు మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాలకూ విస్తరించింది. వ్యవహారమంతా సెల్‌ఫోన్లలోనూ, ఆన్‌లైన్లలోనే సాగుతోంది. ప్రత్యేకంగా సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకుని తమ పేర్లతో లేని సిమ్ కార్డులను యువత బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నారు. రూ.100 కాస్తే రూ.150, రూ.200 ఇస్తామంటూ బుకీలు ఆశ చూపి యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. దాంతో యువత బెట్టింగ్‌లో బిజీబిజీ అయిపోయారు. మ్యాచ్ మొదలవడానికి రెండు, మూడు గంటల ముందే వాట్సప్, మెసేజ్, ఫోన్ కాల్స్, ఇంటర్నెట్‌లో యువత బెట్టింగ్‌ను హోరెత్తిస్తున్నారు. చివరికి సర్వం కోల్పోయి వీధిన పడుతున్నారు. మ్యాచ్ ముగిశాక నగదు పంపిణీలో తేడాలు వస్తుండడంతో విద్యార్థుల్లోనూ, యువతలోనూ గొడవలు తలెత్తి పోలీసు స్టేషన్లలో పంచాయితీల వరకూ వెళ్తుండడం గమనార్హం. బెట్టింగ్ ద్వారా రాష్ట్రంలో రోజుకు రూ.కోట్లు చేతులు మారుతోంది. సాయంత్రమైతే చాలు గ్రామాల్లో ఇదే చర్చ జరుగుతోంది. 'ఈ రోజు ఏ జట్ల మధ్య మ్యాచ్ ఉంది. ఎవరెవరు ఆడుతున్నారు. ఏ జట్టుపై పందెం కాయాలి. ఎంత కాస్తే మనకెంత వస్తుంది' అంటూ యువత ఫోన్లలో సంభాషణలు సాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల మొదలు వృద్ధుల వరకూ అందరూ ఈ బెట్టింగ్ వ్యవహారంలో పాలుపంచుకుంటున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారనే పందెంతో పాటు టాస్ ఎవరు గెలుస్తారన్నదీ నేడు పందెంగా మారిపోయింది. ఈ బంతికి ఎంత స్కోర్ కొడతారనే పందెమూ నేడు అధికంగా సాగుతోంది. తెలియని అమాయక యువత అదృష్టం ఉంటే రూ.లక్షలు సంపాదించుకోవచ్చనే క్షణికావేశంతో బెట్టింగ్ వేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ఉండే బెట్టింగ్ బుకీలు ఆయా ప్రాంతాల వారీగా మధ్యవర్తులను నియమించుకుని వారి ద్వారా బెట్టింగ్ తతంగాన్ని నడిపిస్తున్నారు. స్ట్రైట్, రైసింగ్, 30, 50, ఎస్, ఓకే, డన్ వంటి కోడ్‌లను ఉపయోగిస్తూనే ఈ బెట్టింగ్ అంతా సాగుతోంది. కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో లాడ్జిలలో ఈ బెట్టింగ్ తంతు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్ల మైదానాల్లో సాయంత్రం పూట యువత చేరి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇవ్వడం కూడా ఎక్కడా కనిపించడం లేదు. బెట్టింగ్ ద్వారా ఓ వైపు బుకీలు రూ.లక్షలు, రూ.కోట్లలో సంపాదిస్తుంటే యువత మాత్రం అప్పు చేసి మరీ బెట్టింగ్ కాస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

'పది' పరీక్షలు ప్రారంభం

- 22,693 మంది విద్యార్థులు హాజరు.. - 286 మంది గైర్హాజరు
- కేంద్రాలను జిల్లా కలెక్టర్, ఎస్‌పి, డిఇఒ తనిఖీ
- దొర్నిపాడులో విద్యార్థినికి అకస్మాత్తుగా కడుపు నొప్పి.. ఆస్పత్రికి తరలింపు
- కొలిమిగుండ్ల మండలంలో రోడ్డు ప్రమాదం.. విద్యార్థినికి గాయాలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 22,979 మంది విద్యార్థులకు గాను 22,693 మంది పరీక్షకు హాజరయ్యారు. 286 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నంద్యాల పట్టణంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి, డిఇఒ అనురాధలు తనిఖీ చేశారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్ 28 పరీక్ష కేంద్రాలను విజిట్ చేశారు. దొర్నిపాడులోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థినికి అకస్మాత్తుగా కడుపు నొప్పి రావడంతో వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్, ఇతర అవకతవకలు జరగకుండా పటిష్టంగా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లోకి కాలుక్యులేటర్లు, మొబైల్ ఫోన్లు, ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించ రాదన్నారు. ఇన్విజిలేటర్ల మొబైల్ ఫోన్లు కూడా బయటే డిపాజిట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల సమీప ప్రదేశాల్లో 144 సెక్షన్ అమలు పరచడంతో పాటు జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మొదటి రోజు పరీక్షల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని సెంటర్లలో ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు ఉక్క పోతతో అల్లాడిపోయారు.

రుద్రవరం : రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాలలో సోమవారం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాలలో 156 మంది విద్యార్థులకు గాను 155 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. మోడల్ పాఠశాలలో (మిగతా 6వ పేజీలో..)

పరీక్ష రాసి వస్తుండగా ప్రమాదం - విద్యార్థినికి, వ్యక్తికి గాయాలు


గాయ పడిన విద్యార్థిని నాగ తేజస్విని

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలం కలవటాల గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి, పదో తరగతి పరీక్ష రాసి ఇంటికి వెళుతున్న విద్యార్థినికి గాయాలయ్యాయి. వివరాలు.. కలటాల గ్రామానికి చెందిన ఏసన్న కూతురు కృపావతి, మరొక విద్యార్థిని నాగ తేజస్వినిలు సోమవారం కొలిమిగుండ్లలోని పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష అనంతరం ఇంటికి వచ్చేందుకు కొలిమిగుండ్ల క్రాసింగ్‌లో బస్సు కోసం విద్యార్థినులు నిలబడ్డారు. అదే సమయంలో ఏసన్న కొలిమిగుండ్లలోని పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా కుమార్తె, నాగ తేజస్వినిలు చూసి వారిని బైక్‌పై ఎక్కించుకొని కలవటాల గ్రామానికి బయల్దేరాడు. అదే సమయంలో రాంకో సిమెంట్ పరిశ్రమలోని ఓ ఉద్యోగి విధులు ముగించుకొని బైక్ వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో నాగ తేజస్వినికి, ఏసన్నకు గాయాలయ్యాయి. కృపావతికి ఎలాంటి గాయాలు కాలేదు. నాగ తేజస్వినికి చెయ్యి విరిగింది. విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే అక్కడికి చేరుకుని ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు.



మహానంది : హాల్ టికెట్ నంబర్, గదులను చూసుకుంటున్న విద్యార్థులు

స్పందన వినతులపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఒ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, డిఆర్‌డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. పరిష్కారం కాని సమస్యలకు సరైన ఎండార్స్మెంట్ ఇచ్చి క్లోజ్ చేయాలన్నారు. లేని పక్షంలో మళ్లీ అవే పునరావతమయ్యే అవకాశముందన్నారు. పరిష్కార నివేదికలో అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారని, అధికారులు వాటిని గుర్తించి పరిష్కరించాలన్నారు.



రంజాన్ వేళలు

మంగళవారం
ఇఫ్తార్ : 6 : 36

బుధవారం
సహేరి : 4 : 47

ఎసిబి వలలో విద్యుత్ ట్రాన్స్‌కో ఎఇ

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని కొత్తపల్లి, పాములపాడు మండలాల విద్యుత్ శాఖ ఎఇ వేణుగోపాల్‌రాజు, అతని అనుచరుడు జంబులయ్య రూ. 50 వేలు లంచం తీసుకుంటూ సోమవారం ఎసిబికి దొరికి పోయారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి శివ నారాయణ స్వామికి అందిన సమాచారం మేరకు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. పాములపాడు మండలం భానుముక్కల గ్రామానికి చెందిన బాలీశ్వరయ్య, వెంకటరమణతో పాటు మరికొందరు రైతులు ఇటీవల బోరుబావులు వేయించుకున్నారు. వాటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ ఎఇ వేణుగోపాల్ రాజు రూ. 70 వేల లంచం అడిగాడు. అప్పటికే రైతులు రూ.20 వేలు ఇచ్చినప్పటికీ ఎఇ స్పందించలేదు. రూ.50 వేలు ఇస్తేనే పనులు చేస్తానని చెప్పాడు. దీంతో భానుముక్కల రైతులు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. ఇందులో భాగంగానే ఆత్మకూరు పట్టణంలోని గీతా భవన్‌హోటల్ ఎదురుగా రైతుల నుండి ఎఇ వేణుగోపాల్ రాజుకు మధ్య దళారిగా ఉంటున్న జమ్ములయ్య రూ.50 వేల తీసుకుంటుండగా ఎసిబి అధికారులు వారిని రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి శివన్నారాయణ మాట్లాడుతూ జమ్ములయ్యను అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల చేత పనులు చేయించుకునేటప్పుడు లంచాలు ఇవ్వడం సరైనది కాదని, ఎవరైనా లంచం అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జమ్ములయ్య పాములపాడు మండలం లింగాల గ్రామానికి చెందిన వైసిపి నాయకుడిగా చలామణి అవుతున్నట్లు తెలిసింది.


పట్టుబడిన విద్యుత్ ట్రాన్స్‌కో ఎఇ వేణుగోపాల్ రాజు


లంచంగా తీసుకున్న డబ్బులు


సంఘటనను పరిశీలిస్తున్న ఎస్ఐ, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి

పశువులపాక దగ్ధం

- ఆరు పశువులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

అగ్ని ప్రమాదంతో పశువుల పాక దగ్ధమై ఆరు పశువులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రం పగిడ్యాలలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. పగిడ్యాల గ్రామానికి చెందిన తెలుగు శేఖర్ పశువుల పాకలో 4 ఆవులు, రెండు ఎద్దులను కట్టివేశాడు. ప్రమాదవశాత్తు పాకలో మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి వెంటనే మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఆవులకు, ఎద్దులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు విషయాన్ని పశు వైద్య అధికారులకు తెలియజేయడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పశువులకు చికిత్స అందించారు. మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎంతో ప్రేమగా చూసుకుంటున్న పశువులకు గాయాలు కావడంతో యజమాని శేఖర్ కన్నీరుమున్నీరయ్యాడు.

నవ ధాన్యాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ రీజినల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం నవధాన్యాల సాగుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలో సేంద్రియ కర్బణం పెరగాలంటే పచ్చిరొట్టె పంటలయిన అన్ని జాతుల 30 రకాల నవధాన్య విత్తనాలు ఎకరాకు 13 కిలోలు విత్తన గుళికలు చేసి సాగు చేసుకోవాలన్నారు. తద్వారా భూసారం పెరిగి ప్రధానపంటకు, భూమి కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయని తెలిపారు. తద్వారా పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, అడిషనల్ డిపిఎం సలాం, వెలుగు ఎపిఎం ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ విజయభాస్కర్, యూనిట్ ఇంచార్జ్‌లు ఎస్.నాగరాజు, పుల్లయ్య, కలిముల్లా షాఖాద్రి, సిసింద్రీ, శివకుమార్ ఆచారి, మహేష్ బాబు, ప్రకాశం పాల్గొన్నారు.


నవ ధాన్యాల కిట్లను అందజేస్తున్న అధికారులు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఢిల్లీలో మోడీని, రాష్ట్రంలో జగన్ పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించేందుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ పోరాటం కొనసాగిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నంద్యాలలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనమ మాట్లాడారు. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హెూదా తెస్తానన్న పెద్దమనిషి జగన్ 31 మంది ఎంపీలను పెట్టుకుని ఏం సాధించారని నిలదీశారు. కేంద్రం వద్ద అప్పులు తెచ్చుకునేందుకే ఆయనకు నాలుగేళ్ల కాళ్ల పరిమితి సరిపోయిందని ఎద్దేవా చేశారు. ఒక్క అవకాశం అంటూ అందలమెక్కిన జగన్ ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. మద్యపానాన్ని నిషేధిస్తానన్న జగన్ తన సొంత మద్యం బ్రాండ్లతో ఆదాయాన్ని 23,800 కోట్లకు పెంచుకున్నారని విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ఈనెల 14వ తేదీ నుండి మే 15 వరకు దేశవ్యాప్త పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ పాడైపోయాయని, వాటిని బాగు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దేశ్వరం అలుగును నిర్మించాలని, హంద్రీ నీవా ద్వారా చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకద్దిన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సుంకన్న, పట్టణ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

భారీ చోరీని ఛేదించిన పోలీసులు

- ఆరు గంటల్లోనే నిందితులను అరెస్టు
- 63 తులాల బంగారు, రూ.14 లక్షల నగదును స్వాధీనం

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని రామాపురం గ్రామంలో జరిగిన భారీ దొంగతనాన్ని పోలీసులు చాలెంజ్‌గా తీసుకొని కేవలం 6 గంటల వ్యవధిలోనే ఛేధించారు. నిందితులను అరెస్టు చేసి సొమ్మును రికవరీ చేశారు. వివరాలు.. ఆదివారం తెల్లవారుజామున రామాపురం గ్రామంలో మల్లు వెంకటేశ్వర్ రెడ్డి ఇంటిలో 63 తులాల బంగారు, రూ. 14 లక్షల నగదును దొంగలు దోచుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఇంటిని, వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. మల్లు వెంకటేష్ రెడ్డికి చెందిన ఫ్యాక్టరీలో పనిచేసే ముగ్గురు వ్యక్తులను అనుమానస్పదంగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఓబులాపురం గ్రామానికి చెందిన మేకల సూర్యచంద్రుడు, అవుకు పట్టణానికి చెందిన పోతుల రామాంజనేయులు, లంకెల వన్నప్పలను డోన్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి నేతత్వంలో దొంగలను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. దోచుకున్న సొమ్మును అర్ధరాత్రి కొండల్లో దాచిపెట్టడంతో రెవిన్యూ సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకోవడంతో ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డిని, పోలీసులను జిల్లా ఎస్‌పి అభినందించి రివార్డులు అందజేశారు.

ఎస్‌కు రివార్డు అందజేస్తున్న ఎస్‌పి



వ్యవసాయ శాఖ మంత్రి కాకానితో ఎమ్మెల్యే గంగుల

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోమవారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రితో మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని ఆరు మండలాల రైతులు అకాల వర్షాలతో చాలా నష్టపోయారని వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీనిచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

చిలకలూరుకు తాగునీటి వసతి

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని చిలకలూరు గ్రామానికి రూ 28.30 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు ఆర్డబ్ల్యూఎస్ డిఇ మురళీధర్ రావు తెలిపారు. సోమవారం మండలంలోని చందలూరు గ్రామం నుంచి చిలకలూరు గ్రామానికి ఏర్పాటు చేసిన 3 కిలోమీటర్ల పొడవున పైపులైన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు త్వరలోనే పూర్తి చేసి గ్రామానికి తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, కాంట్రాక్టర్లు ఉన్నారు.

5న శ్రీశైలానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

ప్రజాశక్తి - శ్రీశైలం : ఈనెల 5వ తేదీన రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు మూడు రోజుల పర్యటనకై శ్రీశైలం వస్తున్నట్లుగా దేవస్థానం అధికారులు సోమవారం తెలిపారు. ఐదవ తేదీ రాత్రికి శ్రీశైలం చేరుకొని స్వామి దర్శించుకొని, రాత్రి బస చేస్తారని తెలిపారు. 6వ తేదీ ప్రిస్కలబ్లో డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సులో ప్రోగ్రాంలో పాల్గొని, మధ్యాహ్నం నుండి అక్కమ్మహాదేవి గుహలు సందర్శిస్తారు. ఏడవ తేదీ ఉదయం రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారని అధికారులు తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - మహానంది : చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితమ్మ తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాగులు, జొన్నలు, కొర్రలు, సజ్జలు, మొక్కజొన్న, అలసందలు, పెసలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వీకులు పోషకాహారం తీసుకోవడంతో ఎంతో ఆరోగ్యకరంగా ఉండేవారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించే చిరుధాన్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపిడిఒ శివ నాగజ్యోతి, డిప్యూటీ తహశీల్దార్ నారాయణరెడ్డి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - కొత్తపల్లి : మండలంలోని చిన్న గుమ్మడాపురం వద్ద ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. కొత్తపల్లి మండలంలోని ఏం లింగాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు, కళావతి దంపతుల కొడుకు శ్రీకాంత్ (23) సోమవారం సాయంత్రం ఇంటి నుండి తన ట్రాక్టర్‌లో చిన్న గుమ్మడాపురం నుంచి వ్యవసాయ పనిముట్లు తీసుకు వెళుతున్న క్రమంలో బస్టాండ్ సమీపంలో ఉన్న కాలువ వద్దకు రాగానే అదుపు తప్పి తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మల్లేశ్వర్ రెడ్డి

'కెవి సుబ్బారెడ్డి'లో ఐఐటి, నీట్ కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి జూనియర్ కళాశాలలో ఐఐటి, నీట్, జెఈఈ మెయిన్స్ కోచింగ్ ప్రారంభమైందని ప్రిన్సిపల్ మల్లేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐఐటి, నీట్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ కోచింగ్‌లకు ఆళ్లగడ్డ ప్రాంత విద్యార్థినీ విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చేదని,విద్యార్థుల కోసం చెన్నై మ్యాక్స్ స్పీడ్‌తో ఒప్పందం కుదుర్చుకొని తమ కళాశాలలో క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. 41 రోజులపాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నామమాత్రపు ఫీజుతో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఆళ్లగడ్డ పరిసర ప్రాంత విద్యార్థిని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మ్యాక్స్ స్పీడ్ ప్రతినిధులు అశోక్, అధ్యాపకులు వెంకటస్వామి, హరికృష్ణ, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ట్రాక్టర్, పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని తమ్మరాజు పల్లె గ్రామంలో వైయస్ఆర్ యంత్ర సేవ ద్వారా 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్, రొటోవేటిర్, గొర్రు పరికరాలు రైతులకు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బత్తుల శేషారెడ్డి, ఎంపిటిసి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్ రెడ్డి, హార్టికల్చరల్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

అట్టలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఉయ్యాలవాడలోని ఎస్‌సి హాస్టల్లో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎస్‌సి హాస్టల్ వార్డెన్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉదయం అట్టలు, పెన్నులుచ పెన్సిళ్లపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.


అట్టలు, పెన్నులు పంపిణీ చేస్తున్న వార్డెన్ చంద్రశేఖర్ రెడ్డి

విద్యార్థి బస్సులు నడపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కొత్తపల్లి



ఆర్‌టిసి డిపో మేనేజరు వినతిపత్రం

మండలంలోని వివిధ గ్రామాల నుండి విద్యను అభ్యసించడానికి కొత్తపల్లి మండలం వస్తున్నటువంటి విద్యార్థులకు అనుకూలంగా బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ కె దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆత్మకూరు డిపో మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు విద్యార్థి బస్సులు లేక విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. అలాగే పదవ తరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే చేయండి

ప్రజాశక్తి - బేతంచెర్ల



రీ సర్వేయర్‌లో భాగంగా గ్లూకోస్ వైట్ క్యాప్‌లు అందిస్తున్న తహశీల్దార్

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలోగల భూముల రీ సర్వేలో పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ నరేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రీ సర్వే లో భాగంగా సర్వేర్లకు గ్రామ రెవెన్యూ అధికారులకు ఎండ వేడిమి తగలకుండా గ్లూకోజ్ ప్యాకెట్లు, తెల్ల క్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్, బేతంచర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ భూ రీసర్వేలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు అక్రమాలకు తావు లేకుండా సర్వేయ ర్లు రెవెన్యూ అధికారులు తమ వంతు విధి నిర్వహించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సత్యదీప్, బేతంచెర్ల మండల సర్వేర్ జోష్ణ, ఆర్ఐ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

మండల పరిధిలోని పార్నపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచ్ రామలింగేశ్వర రెడ్డి,ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి,ఎంపీడీవో వాసుదేవ గుప్తాలతో కలిసి ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. సోమవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ శివారులోని పంట కాల్వల పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దినసరి కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొలతల ప్రకారం పనులు చేసి పనులకు తగ్గ వేతనం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్రతో రాయలసీమ ఎడారే

- 24న కర్నూల్‌లో నిరసన దీక్షలు
- రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మిస్తే రాయలసీమ ఎడారిగా మారుతుందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల సూరజ్ హోటల్‌లో రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల రాయలసీమ స్టీరింగ్ కమిటీ నేతలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో సాగునీటి సమస్యను పరిష్కరించడంలో నేతలు విఫలమయ్యారని అన్నారు. వలసలు, నిరుద్యోగ సమస్యలు, రైతుల ఆత్మహత్యలు రాయలసీమలో పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానదిపై తీగల వంతెన ఏర్పాటు చేసి రైతుల గొంతుకు ఉరి వేస్తారా? అని ప్రశ్నించారు. బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కెసి కెనాల్ ఆయకట్టు పరిరక్షణ కోసం గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేయాలని, వేదవతి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 24న కర్నూల్ నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల గ్రౌండ్‌లో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసనదీక్ష చేపడుతున్నామని, రాయలసీమ వాసులందరూ సహకరించాలని కోరారు. అనంతరం సంతకాలసేకరణ చేపట్టి, చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఇప్పటికైనా కళ్ళు తెరిచి అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాది తులసిరెడ్డి, కేంద్ర అవార్డ్ గ్రహీత బండి నారాయణ స్వామి, నవీన్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పోతుకూరి శ్రీకాంత్ నాయుడు, డాక్టర్ రామాంజనేయులు, అశోకవర్ధన్ రెడ్డి, ఉమ్మి సలీమ్, మాజీ కౌన్సిలర్ చింతల సుబ్బారాయుడు, కిరణ్ రాయల్, రామ్మోహన్ రెడ్డి, సీమకృష్ణ, న్యాయవాది బాలస్వామి నంద్యాల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. వి. సుబ్బారెడ్డి, మంద పోరాటసమితి నాయకులు కామిని వేణుగోపాల్ రెడ్డి, ఎంఆర్‌పిఎస్ (మందోరా) రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, బి సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగశేషు, జై భీమ్ జిల్లా అధ్యక్షులు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పాఠశాలను ఐటిడిఎ పిఒ తనిఖీ

ప్రిన్సిపల్, డిప్యూటీ వార్డెన్‌లకు తాఖీదులు



టాయిలెట్స్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పిఒ బి. రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ప్రతిభా పాఠశాల ప్రిన్సిపల్, డిప్యూటి వార్డెలన్‌లకు ఐటీడీఏ పిఒ బి. రవీంద్రారెడ్డి తాఖీదులు జారీ చేశారు. ప్రభుత్వము పాఠశాలల అభివృద్ధి కొరకు ఏర్పాటు చేసిన నాడు –నేడు పథకంలో ఫేస్ వన్ కింద ఎంపిక అయిన పాఠశాలలను తనిఖీలో భాగంగా శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని ప్రతిభా పాఠశాలను ఐటీడీఏ పీవో బి. రవీంద్రారెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టాయిలెట్స్,ఎలక్ట్రిఫికేషన్, తాగునీరు మొదలైన వసతుల గురించి ఆరా తీశారు. డైనింగ్ హాలు పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రంగా ఉన్నదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా డిప్యూటీ వార్డులకు హెచ్చరించారు. టాయిలెట్స్ నందు నీటి సదుపాయం సరిగాలేదని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవలసినదిగా ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల నిర్వహణ, టాయిలెట్స్ నిర్వహణ లోపాలపై సంబంధిత ప్రిన్సిపాల్‌తో పాటు డిప్యూటీ వార్డెన్‌కు తాఖీదులు జారీ చేశారు. తదుపరి సందర్శించే నాటికి ఇప్పుడు గుర్తించబడినటువంటి లోపాలను సవరించుకొనవలసినదిగా ఆదేశంలో పేర్కొన్నారు. ఆదేశాలు పాటించడంలో ఏదైనా అలసత్వం వహించిన ఎడల తగిన చర్యలు తీసుకుంటామని పిఓ హెచ్చరించారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలం



గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడి టీచర్లు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అంగన్వాడి టీచర్లు శైలజ, పెద్దక్క, శాంతమ్మలు తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవములను పురస్కరించుకుని ఈనెల 20 నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగు పౌష్టికాహార పక్షోత్సవాల (పోషన్ పక్వాడ్) సందర్భంగా ముగింపురోజు అయిన సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలో కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ, సూపర్వైజర్ ఆదేశాల మేరకు గర్భవతులు, బాలింతలతో పాటు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారుల తల్లిదండ్రులను పిలిపించి వారికి చిరుధాన్యాలు, బాలామృతం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆరోగ్యం, పిల్లల ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయన్నారు. చిరుధాన్యాలు ఆహార పదార్థాలలో వినియోగించుకొని ఆరోగ్యాన్ని సంరక్షించు కోవాలని కోరారు. పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిరుధాన్యాల ఆహార పదార్థాలు తినడం ద్వారా అత్యధిక పోషక విలువలు కలిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం వెల్ బేబీ షో కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



భారాలకు వ్యతిరేకంగా పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఇంటి పన్ను, చెత్త పన్ను భారాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు ఎన్. స్వాములు, డి రామ్ నాయక్, షేక్ ఇస్మాయిల్‌లు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం రుద్దిన షరతులకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి విలువ ఆధారిత ఆస్తిపన్ను విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. మరోసారి ఆస్తిపన్నుల భారం పెంచారన్నారు. మూడేళ్ల కాలంలో 50 శాతం ఇంటి పన్నులను పెంచడం దారుణం అన్నారు. మరో రెండేళ్లలో పన్నులు రెట్టింపు చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. ఎన్నడు లేనిరీతిలో రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్నుని విధిస్తున్నారని అన్నారు. వృద్ధులు, వితంతు పెన్షన్లు పొందే వారిని బెదిరించి మరీ వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలు

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని గిద్దలూరు గ్రామంలో కళ్యాణ మండపంలో వైయస్సార్ ఆసరా వారోత్సవాలను ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని పొదుపు సంఘం మహిళలు, వైసిపి నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - ప్యాపిలి

శివ సాయి పాఠశాల విద్యార్థులను పాఠశాల యాజ మాన్యం సన్మానించింది. రోల్ల పాడు తండా గ్రామానికి చెందిన ఈశ్వర్ నాయక్ కూతురు పద్మావతి ఎంబీబీఎస్‌లో పూర్తి చేయగా, కుమారుడు కుమార్ నాయక్ ప్రస్తుతం ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం విశ్వభారతి వైద్యశాలలో చదువుతన్నాడు. తల్లిదండ్రులు నిరక్ష్యరాస్యులు అయిన నిరుపేద కుటుంబంలో ఇద్దరు డాక్టర్లు కావడం తల్లిదండ్రుల కృషికి పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది. ఇద్దరు విద్యార్థులు ఏడవ తరగతి వరకు చదివిన శ్రీ శివసాయి పాఠశాల యాజమాన్యం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ చంద్రశేఖర వర్మ హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శివ సాయి పాఠశాల కరస్పాండెంట్ సురేష్, హెచ్ఎం శ్రీదేవి, పద్మావతి, నాగరాజు, పార్వతి, కీర్తి, మహేశ్వరి, పుష్పవతి, అనిత, ప్రవల్లిక, రాజేష్ బాబు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిసన్తున్న దృశ్యం

శ్రీశైలంలో స్పర్శ దర్శనం నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీశైలం

మల్లన్న స్పర్శ దర్శనం ఐదు రోజుల పాటు నిలుపువేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న సోమవారం తెలిపారు. శైలేశ్వర జాతర సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు సందర్శించే అవకాశం ఉందని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 4వ తేదీ నుండి అనగా 8వ తేదీ వరకు స్వామివారి స్పర్శ దర్శనం, మధ్యాహ్నం 12:30 గంటల విఐపి దర్శనం నిలుపువేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. రాత్రి వేళల్లో విరామ సమయంలో స్వామి వారి స్పర్శ దర్శనం యధావిధిగా కొనసాగుతుందని వారు తెలిపారు. మంగళవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు ఉండే స్వామివారి స్పర్శ దర్శనం కూడా నిలుపువేస్తున్నట్లుగా వారు తెలిపారు. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు.

నిత్యాదానంకు విరాళములు

శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించి యాత్రికులకు భక్తులకు దేవస్థానం నిత్యం అందిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి ఎన్.టి.ఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన టి రామకృష్ణ దురా ప్రసాదులు రూ.లక్ష,

కర్ణాటక యాదగిరికి చెందిన శంకరప్ప సర్జన్ రూ.ఒక లక్ష 25 వేలు అన్నప్రసాద పథకానికి విరాళం విరాళం అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం



రుద్రవరం : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నిర్వాహకులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయం ముందు భాగంలో పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మెన్ మహేశ్వర రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్షేత్రానికి భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనం కోసం చాలా దూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వస్తుంటారని తెలిపారు. వేసవిని దృష్టిలో పెటుటకుని భక్తుల దాహార్తి తీర్చేందుకు పాలక మండలి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైరివెంకటమ్మ, బైరి పుల్లన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

రుద్రవరం : రుద్రవరంలో బైరి వెంకటమ్మ, బైరి పుల్లన్న, మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 4 చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మధుసూదన రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు, కార్యదర్శులు మహమ్మద్ రఫీ, అరవింద నాయక్, మౌనిక, మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు బైరి శ్రీహరి, శంకర్, బ్రహ్మం, ఎంపీపీ బాలస్వామి, వైసిపి నాయకులు కొల్లం పుల్లయ్య, ఏరువా కష్ణమూర్తి, నెంబర్‌వన్ హుస్సేన్ తదితరులు అమ్మవారి శాల నాలురోడ్ల కూడలి, పెద్దమ్మ బయలు, పంచాయతీ కార్యాలయం, జెడ్పిఎస్ ఉన్నత పాఠశాల దగ్గర చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

బనగానపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో..

బనగానపల్లె : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో వాసవి క్లబ్, వాసవి వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ డిఎం కిషోర్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాసవీ క్లబ్ కార్యనిర్వహకులు శ్రీరామ సుబ్రమణ్యం, గుండా సుప్రజ ప్రపంచ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, నాయకులు దమ్మాల వెంకటసుబ్బయ్య, గుండా శ్రీనివాసులు, గుండా రవికుమార్, బచ్చు రమేష్, చక్రపాణి, సత్యం, తాల్లాంకి సుబ్రమణ్యం, మహిళా సభ్యులు గుండా వసంత, వంకదారి స్వర్ణలత, ఆపర్ణ, శివజ్యోతిలు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు : ఎస్ఐ

బండి ఆత్మకూరు : ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోసమే ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్సై బాబు తెలిపారు. సోమవారం బస్టాండ్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం తమ అవసరాల కోసం బండి ఆత్మకూరు మండల కేంద్రానికి ప్రజలు వస్తుంటారని బస్టాండ్ వద్ద ఎలాంటి సెంటర్ లేకపోవడం కావునటువంటి వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారని, అలాంటి సమయంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణామం అని అన్నారు. సిపిఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్ రాజు మాట్లాడుతూ బ్యాంకులో పనిమీద, తహశీల్దార్, ఎంపీడీవో, రిజిస్టర్ కార్యాలయాలకు ప్రజలు తమ అవసరాల కోసం వస్తుంటారని, వారి సౌకర్యం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాజేష్, కెవిపిఎస్ నాయకులు మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి : గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రమును ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఎంపీడీవో ఫజల్ రహిమాన్, ఈఓఆర్‌డి బాలకృష్ణ, సర్పంచ్ లక్ష్మీదేవి ప్రారంభించారు. మొదటి రోజు ప్రారంభం కనుక మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు ఎక్కువ ఉన్నందున గ్రామాల నుంచి వస్తున్న ప్రజలకు దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ శివ కుమార్ గౌడ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు చేరవేయడమే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్



లబ్ధిదారులకు బుక్ లెట్ ను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందజేయడమే వైసీపీ లక్షమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని 5వ సచివాలయ పరిధిలో 8వ వార్డు నందు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి ప్రభుత్వంలో లబ్ధి పొందిన లబ్ధిదారులకు బుక్ లెట్ అందజేయడం జరిగిం దన్నారు. వార్డులో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్లు డి.మౌలాబీ,ఆర్ట్ రమణ, నాగేంద్ర, వెంకట రాముడు, కో ఆప్షన్ మెంబర్ రఫీ,పార్టీ నాయకులు కృష్ణారెడ్డి,అశోక్,శ్రీధర్ నాయుడు, డంకేష్, భాస్కర్,సుధాకర్, మెప్మా సిబ్బంది,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పాములపాడు



మజ్జిగను పంపిణీ చేస్తున్న దృశ్యం

పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు పాములపాడు మాజీ ఎంపీపీ జిఎం సుబ్బరాయుడు కుమారుడు జిఎం రవి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాములపాడు ఎస్సై జి అశోక్, పాములపాడు మాజీ సర్పంచ్ ఏ. విజయసింహారెడ్డి, బాలాజీ ఆగ్రో ఏజన్సీస్ ప్రొప్రైటర్ నాయని మధుసూదన్ రావు, రైతు సంఘం నాయకులు కోట్ల నాగేశ్వర్ రెడ్డి, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి హనుమంతు, మైనార్టీ నాయకులు మహమ్మద్ గని పాల్గొని మజ్జిగను పంపిణీ చేశారు. ఎస్సై జి అశోక్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం

(5వ పేజీ తరువాయి..)

198 మంది విద్యార్థులకు 196 మంది పరీక్షలు రాశారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి డిప్యూటీ డిఇఒ క్రిస్టఫర్, పాఠశాల చీఫ్ నాగేశ్వరరావు, డిపార్టెంటల్ ఆఫీసర్ గుర్రప్ప, చీఫ్ శ్రీనివాసులు, డిపార్టెంటల్ ఆఫీసర్ జాఫర్‌లు పరిశీలించారు. **మహానంది :** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, క్రీస్తుజ్యోతి పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 167 మంది విద్యార్థులకు గాను 148 మంది హాజరయ్యారు. క్రీస్తుజ్యోతి పాఠశాలలో 155 మంది విద్యార్థులకు గాను 145 మంది హాజరయ్యారు. పాఠశాలలను తహసీల్దార్ జనార్దన్ శెట్టి పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద మహానంది ఎస్సై నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. **అవుకు :** అవుకు మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో 81 మంది విద్యార్థులకు గాను 78 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 164 మంది విద్యార్థులకు గాను 160 మంది పరీక్షలు రాయగా 4 గైర్హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 262 మంది విద్యార్థులకు గాను 255 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎంఇఒ శ్రీధర్ రావు పర్యవేక్షించారు. **బనగానపల్లె :** మండలంలోని 8 పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈఓ స్వరూప తెలిపారు. మొదటి రోజు 1413 మంది విద్యార్థులకు గాను 1409 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో రెండు సెంటర్లు, బాలుర ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాల, ప్రజ్ఞ ఏవిఆర్, రాఘవేంద్ర ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 1347 మంది విద్యార్థులకు గాను 1324 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలను కట్టుదిట్టమైన వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ టౌన్ సిఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు. **సంజామల :** మండల కేంద్రంలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై ప్రతాప్ తెలిపారు. కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని సెయింట్ జోసెఫ్, గర్ల్స్ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. 580 మంది విద్యార్థులకు గాను 573 మంది హాజరయ్యారని, 7 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. **ఆళ్లగడ్డ :** ఉయ్యాలవాడలోని ఏపి మోడల్ స్కూలు, జడ్పిహెచ్ హైస్కూల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జడ్పీహెచ్ హైస్కూల్లో 175 మంది విద్యార్థులు, మోడల్ స్కూల్‌లో 151 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఎస్ఐ సత్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈఓ జిలానీ భాషా తెలిపారు. 507 మంది విద్యార్థులకు గాను 503 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. కొలిమిగుండ్లలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ ఫ్లయింగ్ స్క్వార్డు లలిత కుమారి తనిఖీ చేశారు.

ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు సొంత ఖర్చులతో ఆటో సౌకర్యం ఏర్పాటు

కొలిమిగుండ్ల మండలం గొర్విమాను గ్రామంలో పదో తరగతి పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు పులి ప్రకాశ్ రెడ్డి తన సొంత ఖర్చులతో ఆటో సౌర్యాన్ని ఏర్పాటు చేశారు. **పగిడ్యాల :** మండల కేంద్రం పగిడ్యాలలో సోమవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెగులర్ విద్యార్థులు సప్లమెంటరి విద్యార్థులతో కలుపు కొని 429 విద్యార్థులు గాను 425 మంది విద్యార్థులు పరీక్షలకు హజరైనట్లు సిట్టింగ్ స్క్వాడ్ వి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 197 మంది విద్యార్థులులో పూర్తి స్థాయిలో హజరైయరన్నారు. మోడల్ స్కూల్ కేంద్రంలో 231 విద్యార్థులకు గాను 228 విద్యార్థులు హజరైయరని 3 ముగ్గురు విద్యార్థులు ఆప్సెంట్ అయినంటు సిట్టింగ్ స్క్వాడ్ వి వెంకటేశ్వర్లు తెలిపారు. రెండు పరీక్ష కేంద్రలను మండల తహశీల్దార్ భారతి తనిఖీలు చేశారు. పాఠశాలల వైదనం చుట్టు పరిశీలించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటణలు జరుగకుండా ముచ్చుమర్రి ఎస్ఐ నాగర్జున ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. **బండి ఆత్మకూర్:** మండలంలో 10వ తరగతి పరీక్షల కేంద్రాలను తహశీల్దార్ ఉమారాణి తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు ఎనిమిది మంది గైర్హాజరు అయ్యారని ఆమె తెలిపారు. **బేతంచర్ల:** పట్టణంలోని సెంటెన్స్, గ్రేస్, శ్రీ నారాయణ, సుమేధా హై స్కూల్, నగర్‌లోని హైస్కూల్, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విద్యార్థులతో కోలాహలం ఏర్పడింది. సిమెంట్ నగర్, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో కలిపి ఆరు పరీక్ష కేంద్రాలలో మొదట రోజు జరిగిన తెలుగు పరీక్షకు 986 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 975 మంది హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. **ఆత్మకూరు :** మండలంలోని పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1120 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 16మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. ఆత్మకూరు పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన్నట్లు ఎంఈఓ జానకి రామ్ తెలిపారు. **పాములపాడు :** పదో తరగతి పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయిన్నట్లు పరీక్ష చీఫ్‌లు కృష్ణమూర్తి, నాగ రవీంద్రుడు తెలిపారు.



కొలిమిగుండ్ల : సొంత ఖర్చులతో ఆటో సౌకర్యం ఏర్పాటు చేసిన ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు పులి ప్రకాశ్ రెడ్డి

బండి ఆత్మకూర్‌లో..



బేతంచెర్లలో..

